


# కానుకలు

గిఫ్ట్ ఆఫ్ ద మాగి: ఆంగ్లమూలం: ఓ. హెన్రీ, అనువాదం: కాకాని చక్రపాణి

ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లు. మొత్తం అందులో అరవై సెంట్లు, పెన్నీల రూపంలో వున్నాయి. వెచ్చాల కొట్టాయన దగ్గరా, కూరగాయల మనిషి దగ్గరా, కసాయి దగ్గరా గీచి గీచి బేరం చేసి తడవకు ఒకటి, రెండు పెన్నీల చొప్పున ఆదా చేసుకున్న డబ్బు అది. నోటితో మాట్లాడకపోయినా, "ఇంత పిసినిగొట్టు మనిషేం?" అన్నట్టు వాళ్లు చూసిన చూపును సిగ్గుతో బుగ్గలు ఎర్రబడ్డా వదలకుండా బేరం చేసి దాచుకున్న డబ్బు అది. మూడుసార్లు లెక్క పెట్టింది డెల్లా. ఒక డాలర్ ఎనభై ఏడు సెంట్లే. రేపు క్రిస్మస్.

ఆమె చేయగలిగిందేమీ లేదు, ఆ కంపు కొట్టే మురికి మంచం మీద పడుకుని ఏడవటం తప్ప. అదే పని చేసింది డెల్లా. జీవితంలో వున్నదేముంది-వెక్కిళ్లూ, నిట్టూర్పులూ, చిరునవ్వులూ తప్ప! అధికభాగం నిట్టూర్పులే-అన్న తాత్త్వికచింతన బయలుదేరుతుంది ఆమెను చూసిన ఎవరికైనా.

అలా ఇంటి యజమానురాలు క్రమంగా మొదటి దశ నుంచి రెండో దశకు చేరుకుంటున్న తరుణంలో మనమలా ఆ ఇంటిని పరిశీలిద్దాం. వారానికి ఎనిమిది డాలర్లు అద్దె చెల్లించాల్సిన ఫర్నిష్డ్ ఫ్లాట్ అది. పేదకంపు కొడుతోంది ఆ ఇల్లు. బిచ్చగాళ్ల కొంపైనా అంత అధ్వానంగా వుండదు.

ఈ ఫ్లాటుకు సంబంధించిన కింద నడవలో ఓ లెటర్ బాక్స్ వుంది; కానీ దాంట్లో చిన్న ఉత్తరం కూడా పోస్ట్‌మాన్ వేయడు. అక్కడే ఓ ఎలక్ట్రిక్ పోల్ కూడా వుంది; అయితే, దాన్ని నొక్కి బెల్ కొట్టిన మానవమాత్రుడెవడూ లేడు. అక్కడే ఓ నేమ్ బోర్డు కూడా వుంది; దాని మీద 'జేమ్స్ డాల్లింగ్ హామ్ యంగ్' అన్న పేరు రాసి వుంది.

ఒకప్పుడు డాలింగ్ హామ్ బాగా బతికినవాడే. అప్పుడతని జీతం వారానికి ముప్పయి డాలర్లు వుండేది. ఇప్పుడా ఆదాయం ఇరవై డాలర్లకు పడిపోగానే నేమ్ బోర్డు మీద అక్షరాలు కూడా చెరిగిపోయి 'డి' అక్షరానికి కుదించుకుపోయాయి. అయితే, ఆ నేమ్ బోర్డ్ యజమాని ఇంటికొచ్చి, తన ఫ్లాటుకు చేరగానే జేమ్స్ డాలింగ్ హామ్ యంగ్ సతీమణి, ప్రేమగా "జిమ్!" అని అతన్ని పిలుస్తూ కౌగలించుకుంటుంది. ఆమె పేరు మీకిప్పటికే డెల్లా అని పరిచయం చేశాం.

డెల్లా ఏడవటం ఆపింది; ఓ గుడ్డ పీలిక మీద పౌడరేసుకుని బుగ్గలకు అద్దుకుంది. కిటికీ ముందు నుంచుని నిరుత్సాహంగా బయటికి చూసింది.

మంచుతో బూడిద రంగులో వున్న పెరట్లో, బూడిద రంగు కంచె మీద, ఓ బూడిద రంగు పిల్లి పాకుతోంది. రేపు క్రిస్మస్ పండగ. జిమ్‌కు ఏదైనా కానుక కొనాలంటే తన దగ్గరున్నవి ఒక డాలర్ ఎనభై సెంట్లే. నెలల తరబడీ ప్రతి పెన్నీనీ జాగ్రత్తగా ఖర్చు చేసి మిగుల్చుకున్న ధనమది. వారానికి ఇరవై డాలర్లు ఏ మూలకు వస్తాయి? తను అనుకున్నదాని కంటే ఖర్చులు అధికమయ్యాయి. ఎప్పుడూ అంతే. జిమ్‌కు బహుమతి కొనటానికి మిగిలింది ఒక డాలర్ ఎనభై సెంట్లే. తన జిమ్‌కు అంతకంటే ఎక్కువ పెట్టి తను కొనలేదు. అతని కోసం చక్కటి కానుక ఒకటి కొనాలని తను ప్లాను చేసుకుంటూ ఎన్ని గంటలు ఆనందంగా గడపలేదు! చక్కటిది, అరుదైంది, విలువైంది-అతని అర్హతకు తగిన కానుకనివ్వాలని తనెన్ని ఆలోచనలు చేసింది!

గది కిటికీల మధ్య బిగించిన అద్దం ఒకటి వుంది. ఎనిమిది డాలర్లు అద్దె ఇచ్చే ఇంట్లోని అద్దాన్ని మీరూ చూసేవుంటారు. అందులో తన ప్రతిబింబం చూసుకోవాలంటే మనిషి సన్నగా, చురుగ్గా వుండాలి. లంబమైన చిన్న ప్రతిబింబపు ముక్కలను అతికించుకుంటే ఆ వ్యక్తి తన రూపరేఖలను గురించి ఉజ్జాయింపుగా ఊహించుకోవచ్చు. డెల్లా సన్నగా వుంటుంది కనుక, ఆ కళలో ప్రావీణ్యం సంపాదించింది.

అమాంతం ఆమె కిటికీ దగ్గరి నుంచి వెనక్కు తిరిగి అద్దం ముందు నుంచుంది. ఆమె కళ్లు వెలుగుతో మెరిశాయి. అయితే ఇరవై సెకెండ్లలోనే ఆమె ముఖం పాలిపోయి, రక్తవిహీనమైంది. వేగంగా ఆమె తన జుట్టును విప్పి పొడుగ్గా కిందికి జార్చింది.

జేమ్స్ డాలింగ్ హామ్ యంగ్‌ల ఇంట్లో భార్యాభర్త లిద్దరికీ గర్వకారణమైన రెండు వస్తువులున్నాయి. వాటిలో ఒకటి జిమ్ బంగారు గడియారం. అది అతని తాత నుంచి తండ్రికీ, తండ్రి నుంచి తనకూ సంక్రమించిన ఆస్తి. రెండోది డెల్లా జుట్టు. షీలామహారాణి గారు తన ఎదుటి ఫ్లాట్‌లో కాపురం పెట్టినట్లయితే, విలువైన ఆభరణాలతో అలంకరించుకునే రాణిగారిని ఎకసక్కెం చేసేట్టుగా డెల్లా తన సంపద-పొడుగాటి, దట్టమైన జుట్టును కిటికీ బయటికి తల వంచి, తడారబెట్టుకునేది. బేస్‌మెంట్ దగ్గర, తన సంపదనంతా పోగేసుకున్న సాల్మన్ రాజునూ, అపార్ట్‌మెంట్‌కు పనివాడుగా పెట్టుకున్నట్లయితే, రాజు గారు అసూయతో గడ్డం పీక్కునేటట్లు జిమ్, అతను కనిపించిన ప్రతి సారీ, చెయ్యెత్తి తన గడియారం చూసుకునేవాడు.

అలలు అలలుగా, నల్లని జలపాతంలా మెరుస్తూ డెల్లా అందమైన జుట్టు ఆమె వీపు మీద పరుచుకుంది. అది సుమారుగా ఆమె మోకాళ్లను తాకుతూ, ఆమె కో వస్త్రంలా భాసించింది. ఆ తరువాత ఆమె దాన్ని వెంటనే, వణుకుతున్న చేతులతో పైకి ముడుచుకుంది. ఓ క్షణం తొట్రుపడిందామె, తరువాత రెండు కన్నీటి బొట్లు ఆమె కనుకొలకుల గుండా జారి, మాసి చింకిపాతైన ఎర్రని కార్పెట్ మీద పడ్డాయి.

తన బ్రౌను జాకెట్టు వేసుకుంది, పైన బ్రౌను హాట్ పెట్టుకున్నది. కళ్లు మెరుస్తూంటే, తిరగ్గానే స్కర్ట్ గుండ్రంగా చుట్టుకుంటూ వుంటే ఆమె గుమ్మం దాటి బయటికొచ్చి వీథిలోకి అడుగు పెట్టింది.

నడుస్తూ వుంటే షాపు పైను బోర్డు కనిపించింది-'మదాం సొఫ్రానీ. హెయిర్ గూడ్స్ ఆఫ్ ఆల్ కైండ్స్'. డెల్లా పరుగెత్తుకుంటూ మెట్లెక్కింది. రొప్పును అదుపు చేసుకుంటూ, లావుగా, తెల్లగా, సీరియస్‌గా వుండే మదాం సొఫ్రానీ ముందు నిలబడింది.

"నా జుట్టు కొంటారా?" అడిగింది డెల్లా.

"జుట్టు కొంటాం" అంది షాపు యజమానురాలు. "ఆ హాటు తీసెయ్యి. నీ జుట్టు ఎలా వుందో చూద్దాం."

నల్లని జలపాతం ఉవ్వెత్తున తుళ్లుతూ కిందికి ప్రవహించింది.

"ఇరవై డాలర్లు" అంది షాపు యజమానురాలు, జుట్టును చేత్తో పట్టుకు చూస్తూ.

"సరే, ఇచ్చెయ్యండి" అంది డెల్లా.

అయ్యో, తరువాతి రెండు గంటలూ ఊహల కలల్లో గడిచిపోయాయి. జిమ్‌కు కానుక కొనటం కోసం ఆమె దుకాణాలను గాలించసాగింది.

చివరికది ఆమెకు దొరికింది. అది ఒక్క జిమ్ కోసమే తయారైనట్టు కనిపించింది. మరే దుకాణంలోనూ అలాంటిది కనిపించలేదు; ఆ దుకాణాల్లో లోపల వున్న వస్తువుల నన్నింటినీ బయటికి తీయించి చూసింది. అది ప్లాటినమ్ గడియారం గొలుసు; సింపుల్‌గా చక్కటి డిజైనులో వుంది. పైన చెక్కిన నగిషీల కోసం కాక, అది తయారుచేసిన లోహానికే అంత ధర పలికేట్టుగా వుంది. మంచి వస్తువులన్నీ అలాగే వుంటాయి. పైగా గడియారానికి చక్కగా సరిపోయేట్టుగా, తగినట్టుగా వుంది. అది చూడగానే ఆమెకు తెలిసిపోయింది, దాన్ని ప్రత్యేకంగా జిమ్ కోసమే తయారుచేశారు. అచ్చంగా అతని లక్షణాలే. చక్కదనం, విలువ-రెండూ కలబోసి వున్నాయి దాన్లోనూ, అతన్లోనూ. దాని ధర ఇరవై ఒక్క డాలర్లు. మారు మాట్లాడకుండా దాన్ని కొనేసింది ఆమె. మిగిలిన ఎనభై ఏడు సెంట్లతో ఆమె పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చింది. ఆ గొలుసును తన బంగారు గడియారానికి తగిలించుకుని ఎలాంటి మనుషుల మధ్యయినా జిమ్ గర్వంగా తలెత్తుకు తిరగ్గలడు. అంతకు ముందు గడియారానికున్న తోలు స్ట్రాప్‌ని



చూసుకుని అతను సిగ్గుపడుతూ వుండేవాడు.

డెల్లా ఇంటికొచ్చాక ఆమె నావహించిన మత్తు కొంత దిగిపోయింది. ఆ జాగాలో వివేకం, ఆలోచన చోటు చేసుకున్నాయి. కర్లింగ్ ఐరన్‌ను బయటికి తీసింది; గాస్ వెలిగించింది; ఉదారతకు ప్రేమ జత అయి కలిగించిన విధ్వంసకప్రక్రియను మరమ్మతు చెయ్యసాగింది. అదేం తేలికైన పని అనుకోకండి, మహా కష్టమైన పని!



నలభై నిమిషాల్లో చిన్న చిన్న ఉంగరాల జుట్టు ఆమె తలను కప్పేసింది; స్కూలు ఎగ్గొట్టి తిరిగే కుర్రాడి ముఖంలా వెలిగిపోయింది ఆమె ముఖం. జాగ్రత్తగా, పరిశీలనగా ఆమె అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంది.

'నన్ను చూడగానే, ఈ పని చేసినందుకు జిమ్ నా చెంప పగలగొడతాడేమో! కానీ నా వంక మరోసారి చూస్తే మాత్రం కోనీ ఐలాండ్ కోరస్ గర్ల్‌లాగా వున్నావే అంటాడు! కానీ, నేనేం చెయ్యను? అయ్యో, ఒక డాలర్ ఎనభై సెంట్లతో నేను మాత్రం ఏం చెయ్యగలను?'

సాయంకాలం ఏడు గంటలకల్లా కాఫీ తయారుచేసింది డెల్లా. మాంసం ముక్కలు వేపటానికి బాణలిని స్టవ్ మీదికి ఎక్కించింది.

జిమ్ ఎప్పుడూ ఆలస్యంగా రాడు. తలుపు కెదురుగా వున్న టేబుల్ మీద కూర్చుని అరచేతిలో గడియారం గొలుసును పరుచుకుని మురిసిపోయింది డెల్లా. అప్పుడు కింద మెట్ల మీద అతని అడుగుల చప్పుడు వినవచ్చింది ఆమెకు. ఓ క్షణం ఆమె ముఖం పాలిపోయింది. రోజువారీ ప్రతి చిన్న సందర్భంలోనూ భగవంతుణ్ని ప్రార్థించటం ఆమెకు అలవాటు.

'దేవుడా! నన్నాయన ఎప్పటిలా అందంగా వున్నట్టు భావించేలా చెయ్యి!' అనుకుంది ఆమె.


తలుపు తెరుచుకుంది. జిమ్ లోపలికొచ్చి, తలుపు మూశాడు. మనిషి పొడుగ్గా సన్నగా వున్నాడు; గంభీరంగా వున్నాడు. పాపం, తనకు ఇరవై రెండేళ్లు కూడా లేవు కానీ, కుటుంబభారం పైన పడక తప్పలేదు. చలికి తట్టుకోటానికి తనకో కొత్త వోవర్ కోటు కావాలి. చేతులకు గ్లవుజులు కూడా లేవు.

జిమ్ తలుపు దగ్గరే ఆగిపోయాడు. పరిగపిట్ట వాసన పసిగట్టిన జాగిలంలా కదలక మెదలక నిలబడిపోయాడు. అతని కళ్లు నిశ్చలంగా డెల్లానే చూస్తున్నాయి.

వాటిలో అభివ్యక్తమైన భావనను ఆమె అర్థం చేసుకోలేకపోయింది. భయకంపితురాలై పోయింది. వాటిలో కోపం లేదు, ఆశ్చర్యం లేదు, ఖేదం లేదు, భయానకత లేదు. తను ఎదుర్కోటానికి సిద్ధపడిన భావాలేవీ ఆ కళ్లలో వ్యక్తమవలేదు. ముఖంలో ఓ ప్రత్యేకభావన కనబడుతుంటే అతను ఆమె వంక గుడ్లప్పగించి చూశాడు.

డెల్లా ఆదుర్దాగా టేబుల్ దిగిపోయి, అతనికి దగ్గరగా వెళ్లింది. "అయ్యో, జిమ్! నువ్వలా నా వంక చూడకు. క్రిస్మస్‌కు ఏ కానుకా నీకివ్వకుండా వుండటం నా వల్ల కాలేదు. అందుకే నా జుట్టు కత్తిరింపించేసుకున్నాను, అమ్మేశాను. అది మళ్లీ పెరుగుతుంది. నువ్వేమనుకోవద్దు. దిగులు పడొద్దు. నాకా పని చెయ్యక తప్పలేదు. నా జుట్టు చాలా తొందరగా పెరుగుతుంది. మెర్రీ క్రిస్మస్ చెప్పవూ నాకు, జిమ్? మన ఆనందానికి ఏదీ అడ్డు రాకూడదు.. నీకు తెలీదు-నీ కోసం నేనెలాంటి చక్కని కానుక తెచ్చానో, ఎంత చక్కగా వుందో అది!"

"నువ్వు జుట్టు కత్తిరింపించేసుకున్నావా?" అనడిగాడు, జిమ్ గొంతు పెగుల్చుకుంటూ అతికష్టంగా. ఎంతో ప్రయాసపడినా ఆ నిజం అతని బుర్రకు బోధపడనట్టుగా వుంది, అతనడిగిన తీరు.



"అవును, కత్తిరింపించేసుకున్నాను, అమ్మేశాను" అంది డెల్లా. "ఇలా వుంటే నేను నీకు బాగనిపించటం లేదా? జుట్టు లేకపోతేనేం, నేను నీ డెల్లాను కానా?"


జిమ్ విచిత్రంగా గదిని కలయజూశాడు. "నీ జుట్టు పోయిందన్నమాట!" అన్నాడతను, బుద్ధి పోయినట్లుగా.

"దాని కోసం చూడకు" అంది డెల్లా. "అమ్మేశాను. అవును, అమ్మేశాను. పోయింది. ఇది క్రిస్మస్ ఈవ్. మగడా, నీ కోసమే నా జుట్టును అమ్మేశాను. ఒక్క మంచిమాట మాట్లాడవేం? బహుశా నా జుట్టుకు రోజులు వెళ్లిపోయినట్లున్నాయి." మరుక్షణంలో గంభీరంగా అంది, "కానీ, నీ పట్ల నా ప్రేమకు రోజులు చెల్లిపోలేదు. స్టవ్ వెలిగించి కూర వండేదా జిమ్?"

సమాధిలో నుంచి అప్పుడే మేల్కొన్నట్టయింది జిమ్ పరిస్థితి. అతను డెల్లాను తన చేతులతో చుట్టేశాడు. మనం ఓ పది నిమిషాలు మరో వైపు తిరిగి ఏ పనికిరాని వస్తువు వంకైనా పరిశీలనగా, దీక్షగా చూడటం మంచిది. వారానికి ఎనిమిది డాలర్ల జీతమైతేనేం, సంవత్సరానికి మిలియన్ డాలర్లయితేనేం?-తేడా ఏముంది? అందుకు గణితశాస్త్రజ్ఞుణ్నో, విద్వాంసుణ్నో అడక్కండి. వాళ్లిచ్చే జవాబులు తప్పు అవుతాయి. (శిశువుగా వున్న ఏసుక్రీస్తును దర్శించటానికి వచ్చిన ముగ్గురు) మహాజ్ఞానులైన మునులు ఎన్నో విలువైన కానుకలు తెచ్చారు. కానీ వాటిలో అది లేదు.

జిమ్ తన వోవర్ కోటు జేబులో నుంచి ఓ పాకేజీని తీసి బల్ల మీద పడేశాడు. "నా విషయంలో పొరపాటు పడకు డెల్. నువ్వు జుట్టు కత్తిరింపించుకున్నా-ముండనం చేయించుకున్నా, షాంపూతో తలంటు పోసుకున్నా, లేకపోయినా-మరేమైనా నాకు నీ మీదున్న ప్రేమ శతాంశం కూడా తరగదు. నువ్వా పాకేజీని విప్పితే, నేను మొదట ఎందుకలా ప్రవర్తించానో నీకర్థమవుతుంది" అన్నాడు.

డెల్లా తాడు ముడి విప్పి, పాకేజీ పైకాయితం తీసేసింది. లోపల చూడగానే మహదానందంగా ఒక్క కేక పెట్టింది. కానీ, పాపం, వెంటనే ఆ




ఆనందం రోదనలోకి మారి వెక్కిళ్లు పెట్టింది. ఇంటి యజమానికి తన శక్తినంతా వినియోగించి ఆమెను బుజ్జగించాల్సివచ్చింది.

అ పాకేజీలో వున్ని దువ్వెనలు-సైడువీ, వెనకవీ, బ్రాడ్ వే షాపుల్లో వాటిని చూసి డెల్లా ఎంతో ముచ్చట పడింది. చక్కటి అందమైన దువ్వెనలు, పూర్తిగా తాబేటి చిప్ప నుంచి తొలిచినవి, వాటి పైన చక్కటి నగిషీ. అవి చాలా ఖరీదైన దువ్వెనలు. వాటిని తను సొంతం చేసుకోగలనన్న ఆశ లేకపోయినా ఆమె హృదయం వాటిని కోరుకుంది, వాటి కోసం తపించింది. ఇప్పుడు అవి ఆమె సొంతమయాయి. కానీ, అవి అలంకరించాల్సిన ఆమె పాయల జుట్టు మాత్రం లేదు!

ఆమె వాటిని తన హృదయానికి హత్తుకుంది. చాలా సేపు నీళ్లు నిండిన కళ్లతో వాటి వంక చూసింది. చివరికి నవ్వి అంది: "నా జుట్టు త్వరగా పెరుగుతుంది, జిమ్!" అని.

మరుక్షణం డెల్లా కాలు కాలిన పిల్లిలా గంతేసింది. 'అయ్యో, నా మతి మండా!' అనుకుంది. తను తెచ్చిన చక్కని కానుకను జిమ్ ఇంకా చూడనేలేదు. ఆమె దాన్ని తన అరచేతిలో పరిచి చేతిని అతని ఎదుటికి చాపింది. ఆమె గాఢానురక్తిని ప్రతిబింబించేట్టుగా ఆ గొలుసు విలువైన లోహం మెరిసింది.

"చక్కగా లేదూ జిమ్? దీని కోసం పట్నంలో ఎన్ని దుకాణాలు గాలించాననీ? ఇది నీ గడియారానికి తగిలించుకుని రోజుకు వందసార్లు టైము చూసుకోవాలి నువ్వు. నీ గడియారం ఇలా ఇవ్వు. దానికి దీన్ని తగిలిస్తే ఎలా వుంటుందో చూడాలని వుంది."

ఆమె చెప్పినట్టు చెయ్యటానికి బదులు, జిమ్ పక్క మీదికి వాలి, చేతులను తల కింద పెట్టుకుంటూ చిరునవ్వు నవ్వాడు. "డెల్లా! మనం క్రిస్మస్ కానుకలను కొంతకాలం అలా పక్కన పెట్టేద్దాం. అవి ఎంత అద్భుతమైనవంటే వాటిని మనం ప్రస్తుతానికి ఉపయోగించలేం. నీకు దువ్వెనలు కొనటానికి డబ్బు కావాలి. అందు కోసం నా గడియారాన్ని అమ్మేశాను. ఇంక నువ్వు స్టవ్ వెలిగించి కూర వండెయ్..."

మాగి ఎవరో మీకు తెలుసు. పశువుల పాకలో బాలఏసును సందర్శించటానికి కానుకలతో వచ్చారే మహాజ్ఞానులైన మునులు-వాళ్లనే మాగి అంటారు. వాళ్లు మేధావులు. క్రిస్మస్ సందర్భంగా కానుకలిచ్చే ఆచారాన్ని వాళ్లే ప్రవేశపెట్టారు. వాళ్లు జ్ఞానులు కనుక, వాళ్లిచ్చిన కానుకలు కూడా నిస్సందేహంగా తెలివితో కూడినవే అయుంటాయి, మార్పిడికి వీలయేట్టూ వుంటాయి. ఇప్పుడు నీకు మహాపవిత్రమైన ఫ్లాటులో చాలీచాలని జీవితాన్ని గడుపుతున్న ఓ యువదంపతుల కథ మీకు చెప్పాను. వాళ్ల జీవితాల్లో జరిగే గొప్ప సంఘటనలేం వుండవు. ఈ కాలపు తెలివిగలవాళ్ల కో మాట చెప్పాలి. అందరూ ఎన్నో కానుకలిస్తూ వుంటారు. అలాంటి వాళ్లందరిలోకీ మహాజ్ఞానులు వీళ్లు. అలాగే, ఎంతోమంది కానుకలన్నీ పుచ్చుకుంటూవుంటారు. అలాంటి వాళ్లందరిలోకీ మహాజ్ఞానులు వీళ్లే. ఎక్కడైనా, ఏ చోటైనా వీళ్లు జ్ఞానులే! వాళ్లే 'మాగి'-మహాజ్ఞానులైన మునులు!

■